

# పుస్తక పరిచయం







విశ్వకవి రవీంద్రుని పేరు వినగానే ‘గీతాంజలి‘ కవితాత్మ మనసంతా కమ్ముకుంటుంది. విశ్వకవి కలంనుంచీ వెలువడిన మినీ కవితల సంపుటి Stray Birds– (‘మినీ కవిత‘ అనే పదాన్నిసమకాలీన సాహిత్య ధోరణుల దృష్ట్యానే అన్వయించుకోవాలి). ఇందులో అన్నీ ఒటి రెండు వాక్యాల కవితలే. ప్రకృతీ,స్నేహం, ఆశావాదం, మనిషి తనం, మనసులో మెదిలే వివిధ భావాలూ.. ఎన్నింటినో స్పృశిస్తాయి ఈ కవితలు. కవితా పంక్తులు చిన్నవే ఐనా ఒక్కో వాక్యంలోని అర్థం, గుండె లోతుల్ని సూటిగా తాకే భావం మనల్ని పదే పదే వెంటాడుతాయి. బెంగాలీలో వ్రాసిన తన కవితలని రవీంద్రనాథ్ ఠాగోర్ గారే స్వయంగా అంగ్లంలోకి అనువాదం చేసారు. ఆంగ్ల వాక్యాల పరిమళాలని ఆస్వాదిస్తుంటే మాతృకలోని మాధుర్యం ఏమాత్రం తీసిపోలేదు అనిపిస్తుంది. ఈ అద్భుతమైన కవితల్ని అంత సుందరంగానూ తెలుగులోకి అనువదించారు బొల్లోజు బాబా గారు. కవిత్వాన్ని అనువదించడం అంటే చాలా పెద్ద సాహసమే. వచనాన్ని అనువదించడంలో చాలా సౌలభ్యం ఉంటుంది. వివరణకోసం ఒకటి రెండు వాక్యాలు ఎక్కువ వ్రాసినా ఫరవాలేదు. కానీ కవిత్వంలో అలా కాదు. మూలంలోని అర్థం ఏమాత్రం మారకుండా పదాల పొందిక సాగడమే కాక కవిత నడక కూడా చెదరకూడదు. ఈ విషయంలో బొల్లోజు బాబా గారు నూటికి నూరు శాతం విజయం సాధించారని చెప్పవచ్చు. ఇటీవల కాలంలో సొంత గొంతుకతో చక్కటి చిక్కటి కవిత్వం వ్రాస్తున్న బాబా గారు, అంత గాఢమైన కవిత్వాన్నీ ఈ అనువాద కవితా చరణాల్లో పొదిగారు. మచ్చుకి కొన్ని - నా హృదయ శిశిర దినాలపై / నీ సూర్యోదయం నవ్వులు చిందిస్తోంది./ నా వసంతాగమనం పట్ల రవంత / అనుమానం లేకుండా! - సూర్యుని కోల్పోయినందుకు కన్నీరు రాల్చుకుంటే / నక్షత్రాలను కూడా చేజార్చుకోవలసి వస్తుంది. 300 పైగా సాగిన ఈ కవితలు కేవలం చదువుకుని మరిచిపోలేము. వెంటనే ఎవరికైనా చదివి వినిపించాలనిపిస్తుంది. 31 పేజీల ఈ పుస్తకాన్ని అందరికీ అందుబాటులో ఉండే ఇ-పుస్తకంలా scribd.com లో ఉచితంగా ఉంచారు. కేవలం కవిత్వాన్ని ప్రేమించేవారు మాత్రమే కాక మంచి భావాలని అందమైన తెలుగులో చూడాలనుకున్న వారందరూ చదివాల్సిన పుస్తకం.

***Click here to read the book.***




తెలుగులో యాత్రా రచనలు చాలా తక్కువ. ఉన్న కొద్ది యాత్రా రచనలు కూడా రచయితలు వివిధ ప్రదేశాలకి , దేశాలకి వెళ్ళినప్పుడు వ్రాసినవే. ఈ పుస్తకం వాటన్నింటికంటే భిన్నమైంది. తెలుగులో మొట్టమొదటి పాదాయాత్రా రచన. దీన్ని రాసింది ఆంధ్ర విశ్వవిద్యాలయం, లలితకళల విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న 'ప్రయాణాల పక్షి' డా.ఎం. ఆదినారాయణ గారు. ఆయన 1993-94 సంవత్సరాలలో జరిపిన మూడు సుదీర్ఘ పాదయాత్రల సమగ్ర చిత్రణే ఈ పుస్తకం. ఈ పుస్తకం చదువుతుంటే రచయితతో పాటే మనమూ ఆ ప్రదేశాలన్నీ చూస్తున్నట్లనిపిస్తుంది. ప్రతి చోటా సవివరంగా మార్గ సూచికల్ని కూడా మ్యాపు రేఖా చిత్రాలుగా ఇవ్వడం వల్లన రచయిత వివరించే ప్రదేశాలు కళ్ళకు కట్టినట్లుంటాయి. ఈయన విశాఖపట్నంనుంచీ డార్జిలింగ్ వరకూ చేసిన మొదటి యాత్ర, గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో చేసిన రెండో యాత్ర, న్యూఢిల్లీ వరకూ చేసిన మూడో పాదయాత్ర ఇందులో వివరించారు. ఈ పుస్తకం 1999 లో మొదటి ప్రచురణ జరిగింది. ఆరేళ్ళలో మూడు సార్లు పునర్ముద్రించబడింది. 2000 సంవత్సరంలో ఇందులో కొంత భాగాన్ని 10 వతరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా పెట్టారు. ఆకాశవాణి నుంచీ ఇందులోని భాగాల్ని శ్రవణ రూపంలో ప్రసారం చేసారు. ఈ పుస్తకానికి 'యుగళ్ళ సాహితీ పురస్కారం' కూడా వచ్చింది. వెనుక అట్టమీద వ్రాసిన కింది వాక్యాలు ఈ పుస్తక పరిచయానికి సమగ్రరూపం "రాహుల్జీని మనస్సు గురువుగా ఆరాధించి చేసిన తపస్సే ఆదినారాయణ కొనసాగించిన పాదయాత్రల ప్రభంజనం. ఒక సంవత్సరంలో చేసిన మూడు యాత్రల్లోని 4000 కిలోమీటర్ల కాలి నడక అనుభవాల పూల మొగ్గలు ఈ 'భ్రమణకాంక్ష'లో పుష్పించాయి. ఒక పేజీ తిప్పగానే మనమూ ఆ ప్రదేశాన్ని స్వయంగా చూసిన అనుభూతిని పొందుతాం.

---

***Dr,M. Adinarayana***
***Associate Professor***
***Dept. of Fine Arts, Andhra University***
***Visakhapatnam***
***scholorgypsy@rediffmail.com***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor
KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct
Dublin, CA 94568,USA